# నగర పార్కుల అభివృద్ధికి ఎంఎంసి కృషి

### కమిషనర్ టి. వినయ్ కృష్ణా రెడ్డి



ప్రజాపక్షం/హైదరాబాద్ : నగరంలో పార్కుల అభివృద్ధి, చెరువుల పరిశుభ్రత, ట్రాఫిక్ సమస్యల పరిష్కారం కోసం కఠిన చర్యలు తీసుకుంటామని మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్ (ఎంఎంసి) కమిషనర్ టి. వినయ్ కృష్ణా రెడ్డి తెలిపారు. '99 రోజుల కార్యాచరణ ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక'లో భాగంగా శనివారం ఆయన నగరంలోని పలు ప్రాంతాలను సందర్శించారు. మొదట సఫిల్ గూడ చెరువు పార్కును పరిశీలించిన కమిషనర్, చెరువులో పేరుకుపోయిన వ్యర్థాలను తొలగించి పరిశుభ్రంగా ఉంచాలని అధికారులకు ఆదేశించారు. చెరువుల్లో చెత్త వేయకుండా ప్రజల్లో అవగాహన కల్పించాలని సూచించారు. దోమల నియంత్రణ కోసం స్ప్రేయింగ్, ఆయిల్ బాల్స్ వినియోగించాలన్నారు. అలాగే భవన నిర్మాణ వ్యర్థాలను నాలాల్లో వేయకుండా కట్టడి చేయాలని చెప్పారు. అక్కడ ఏర్పాటు చేసిన మహిళా శక్తి – మిల్లెట్స్ ఫుడ్ కోర్ట్‌ను అభినందించారు. నేరేడ్‌మెట్ వాయుపురి కాలనీలో సెకండరీ కలెక్షన్, రవాణా యూనిట్‌ను తనిఖీ చేసిన ఆయన, వ్యర్థాల సేకరణ ప్రక్రియను సమీక్షించారు. ట్రాన్స్‌ఫర్మర్ పరిసరాల్లో పరిశుభ్రత పాటించాలని సూచించారు. ట్రాఫిక్ అంతరాయం కలిగించే ఆక్రమణలను తొలగించాలని స్పష్టం చేశారు. అనంతరం వాయుపురి వెస్ట్ పార్కును సందర్శించి, పార్కులో టాయిలెట్లు, లైటింగ్ సదుపాయాలను మెరుగుపరచాలని ఆదేశించారు. రహదారులపై ఆక్రమణల వల్ల ట్రాఫిక్‌కు ఇబ్బంది కలుగుతోందని గుర్తించి, వాటిని వెంటనే తొలగించాలని తెలిపారు. యాప్రాల్ ప్రాంతంలో కొనసాగుతున్న నిర్మాణాలను పరిశీలించిన కమిషనర్, సెట్‌బ్యాక్ నిబంధనలు కచ్చితంగా పాటించాలన్నారు. టౌన్ ప్లానింగ్ అధికారులు అనుమతులకు విరుద్ధంగా ఉన్న నిర్మాణాలపై కఠిన చర్యలు తీసుకోవాలని సూచించారు. విమలాదేవి నగర్‌లో భవన నిర్మాణాలు అనుమతులకు అనుగుణంగా ఉన్నాయా అనే విషయాన్ని అధికారులు నిర్ధారించాలని ఆదేశించారు. ఎలాంటి ఉల్లంఘనలు ఉన్నా కఠినంగా పర్యవేక్షించి, చర్యలు తీసుకోవాలని సూచించారు. నగర పరిశుభ్రత, పార్కుల అభివృద్ధి, ట్రాఫిక్ సమస్యల పరిష్కారానికి ఎంఎంసి కట్టుబడి ఉందని కమిషనర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో మల్కాజిగిరి టౌన్‌ప్లానింగ్ సిపి శ్రీనివాస్ రావు ఇతర అధికారులు పాల్గొన్నారు.

# నార్సింగిలో 'మెగా శానిటేషన్ డ్రైవ్'



### 173 మెట్రిక్ టన్నుల వ్యర్థాల తొలగింపు

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ (సిఎంసి) ఆధ్వర్యంలో శేరిలింగంపల్లి జోన్ పరిధిలోని నార్సింగి సర్కిల్45లో శనివారం చేపట్టిన 'మెగా శానిటేషన్ డ్రైవ్' విజయవంతమైందని అధికారులు తెలిపారు. నగరంలో పారిశుధ్యాన్ని మెరుగుపరచడం, ప్రజలకు ఆరోగ్యకరమైన వాతావరణాన్ని అందించడమే లక్ష్యంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించామన్నారు. సుమారు 10 కిలోమీటర్ల మేర 20 ప్రధాన ప్రాంతాలలో ఈ పారిశుధ్య కార్యక్రమం నిర్వహించారు. మర్రిచెట్టు జంక్షన్, పుప్పాల్‌గూడ పైప్లైన్ రోడ్ ఫ్రెండ్స్ కాలనీ, అల్కాపూర్ వంటి ప్రాంతాల్లో వ్యర్థాలను తొలగించారు. ఈ కార్యక్రమంలో 40 మంది అధికారులు, 313 మంది పారిశుధ్య కార్మికులు పాల్గొన్నారు. పనుల కోసం 47 వాహనాలను (జెసిబిలు, టిప్పర్లు, ట్రాక్టర్లు, ఆటోలు) వినియోగించారు. ఈ డ్రైవ్ ద్వారా మొత్తం 173.70 మెట్రిక్ టన్నుల వ్యర్థాలను సేకరించారు. నిర్మాణ వ్యర్థాలు 150 మెట్రిక్ టన్నులు, చెత్త 15 మెట్రిక్ టన్నులు, పూడిక 7 మెట్రిక్ టన్నులు, పచ్చని వ్యర్థాలు 1.7 మెట్రిక్ టన్నులు తరలించారు. పారిశుధ్యంతో పాటు 350 ఆక్రమణలను తొలగించారు. అలాగే 25 వీధి దీపాలను పునరుద్ధరించి, 7 చోట్ల వదులుగా ఉన్న కేబుల్స్‌ను సరిచేశారు. పారిశుధ్య కార్మికులు, అధికారుల సమష్టి కృషి వల్ల ఈ కార్యక్రమం విజయవంతమైందని కమిషనర్ శృజన తెలిపారు. భవిష్యత్తులో సైబరాబాద్‌లోని అన్ని సర్కిళ్లలో దశలవారీగా ఇలాంటి మెగా డ్రైవ్‌లు నిర్వహించనున్నట్లు ఆమే చెప్పారు.

### వర్షాకాలానికి ముందే

# నాలాల పూడికతీత పూర్తి

### సైబరాబాద్‌లో ముమ్మరంగా నాలాల పూడికతీత



**జోన్‌ల వారీగా పనుల పురోగతి**

కార్పొరేషన్ పరిధిలోని మూడు జోన్‌లలో పనులు ఈ క్రింది విధంగా సాగుతున్నాయి.

| జోన్ పేరు | మంజూరైన పనులు | అంచనా వ్యయం (కోట్లలో) | మొత్తం పొడవు (కి.మీ) | పూర్తయిన పొడవు (కి.మీ) | పురోగతి (%) |
|---|---|---|---|---|---|
| శేరిలింగంపల్లి | 22 | రూ.8.14 | 76.37 | 48.35 | 67.55 |
| కూకట్‌పల్లి | 23 | రూ.5.80 | 78.13 | 39.82 | 59.32 |
| కుత్బుల్లాపూర్ | 27 | రూ.4.06 | 62.91 | 10.52 | 21.52 |

ప్రజాపక్షం/హైదరాబాద్ : రానున్న వర్షాకాలంలో నగరంలో వర్షపు నీరు సాఫీగా వెళ్లేలా, లోతట్టు ప్రాంతాల్లో నీరు నిలవకుండా ఉండేందుకు సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ (సిఎంసి) ముందస్తు చర్యలకు శ్రీకారం చుట్టింది. తన పరిధిలోని డ్రైనేజీల సామర్థ్యాన్ని పెంచేందుకు ముమ్మరంగా పూడికతీత పనులను చేపడుతోంది. 2026 సంవత్సరానికి గాను, కార్పొరేషన్ మొత్తం రూ.18.00 కోట్ల అంచనా వ్యయంతో 72 పనులకు పరిపాలనా అనుమతులు మంజూరు చేసింది. ఈ పనుల కింద మొత్తం 217.41 కిలోమీటర్ల మేర పూడికతీత చేపట్టాల్సి ఉండగా, ప్రస్తుతం ఈ పనులన్ని వివిధ దశల్లో కొనసాగుతున్నాయి. ప్రస్తుత గణాంకాల ప్రకారం, ఇప్పటివరకు 98.69 కిలోమీటర్ల మేర పనులు పూర్తయ్యాయి. అంటే మొత్తం మీద 49.46 శాతం పురోగతి సాధించింది.

యంత్రాల ద్వారా : 126.68 కిలోమీటర్లు.

మానవ వనరుల ద్వారా 90.72 కిలోమీటర్లు.

**వ్యర్థాల తరలింపు మరియు గడువు**

కాలువల నుండి తీసిన పూడికను ఎండబెట్టడం కోసం సమీపంలోని కేటాయించిన ప్రాంతాల్లో





తాత్కాలికంగా నిల్వ చేస్తున్నారు. అవి పూర్తిగా ఎండిన తర్వాత, జవహర్ నగర్ డంప్ యార్డుకు తరలించి శాస్త్రీయ పద్ధతిలో ల్యాండ్‌ఫిల్లింగ్ చేయనున్నారు. వర్షాకాలం ప్రారంభమయ్యే నాటికి వ్యవస్థను సిద్ధం చేయాలనే లక్ష్యంతో, ఈనెల చివరి నాటికి ఈ పనులన్నింటిని పూర్తి చేయాలని కమిషనర్ శృజన నిర్దేశించారు. వర్షాకాలం సమయంలో ఆ తర్వాత కూడా ప్రవాహానికి ఆటంకం కలగకుండా ఉండేందుకు ఇదే ఏజెన్సీల ద్వారా నిరంతరం పర్యవేక్షణ కొనసాగుతుందని కమిషనర్ తెలిపారు. నగర మౌలిక సదుపాయాలను బలోపేతం చేసి, ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా చూడటమే తమ ప్రాధాన్యత అని కమిషనర్ అన్నారు.

# 13న సంయుక్త కిసాన్ మోర్చా మహా ధర్నా

### అమెరికా–భారత్ ద్వైపాక్షిక వాణిజ్య ఒప్పందం రద్దు చేయాలి

### రైతులకు ఇచ్చిన హామీలను అమలు చేయాలి : ఎస్‌కెఎం

ప్రజాపక్షం/హైదరాబాద్ : అమెరికా భారత్ వాణిజ్యం ఒప్పందాన్ని రద్దు చేయాలని, కేంద్ర ప్రభుత్వం రైతాంగానికి రాతపూర్వకంగా ఇచ్చిన అహమీలను అమలు చేయాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 13వ తేదీన హైదరాబాద్ ఇందిరాపార్క్ వద్ద మహాధర్నాను నిర్వహించనున్నట్లు సంయుక్త కిసాన్ మోర్చా (ఎస్‌కెఎం) రాష్ట్ర కన్వీనర్లు పిలుపునిచ్చారు. దేశంలో వరి, గోధుమ, మొక్కజొన్న, పత్తి, సోయాబీన్, చెరుకు వంటి పంటలతో పాటు పాడి, పశుసంవర్ధక రంగాలు గ్రామీణ ఆర్థిక వ్యవస్థకు వెన్నెముకగా నిలుస్తున్నాయని, రైతు అభివృద్ధి అంటే గ్రామీణ స్థిరత్వం, ఆహార భద్రత, సామాజిక సమానత్వానికి పునాది అని ఎస్‌కెఎం రాష్ట్ర కన్వీనర్లు పశ్య పద్మ, టి.సాగర్, వి.ప్రభాకర్, మండల వెంకన్న, జక్కుల వెంకటయ్య, పెద్దారపు రమేష్, వి నాగిరెడ్డి, ఆర్.వెంకట్రాములు, కాంతయ్య ఒక ప్రకటనలో తెలిపారు. 2014కు ముందు కేంద్ర ప్రభుత్వం కనీస మద్దతు ధరలకు చట్టబద్ధ గ్యారెంటీ, స్వామినాథన్ కమిషన్ సిఫారసుల ప్రకారం సి2+ 50 శాతం ధరలు, 2022 నాటికి రైతు ఆదాయం రెట్టింపు చేస్తామనే హామీలు నేటికి నేరవేర్చలేదని, ఈ డిమాండ్ల సాధన కోసం నిర్వహిస్తున్న ఈ మహాధర్నాలో రైతులు, కార్మికులు, ప్రజాస్వామ్యవాదులు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని వారు కోరారు.

# రూల్స్ ప్రకారమే కంచె

### చట్టబద్ధమైన విధానాలను తప్పనిసరిగా అనుసరించాలని హైడ్రాకు హైకోర్టు ఆదేశం

ప్రజాపక్షం/హైదరాబాద్ : ప్రభుత్వ భూములపై కంచె ఏర్పాటు చేయాలంటే చట్టబద్ధమైన విధానాలను తప్పనిసరిగా అనుసరించాలని హైడ్రాకు హైకోర్టు ఆదేశించింది. ప్రభుత్వ భూమి అన్న పేరుతో నియమాలు పక్కనబెట్టి యథేచ్ఛగా కంచెలు వేయడం అనుమతించబోదని స్పష్టంచేసింది. నిషేధిత జాబితాలో ఉందనే కారణంతోనే భూములకు కంచె వేయడం సరైంది కాదని కోర్టు అభిప్రాయపడింది. సంబంధిత భూమి నిజంగా ప్రభుత్వానికి చెందినదనే ధృవీకరణ, అవసరమైన అనుమతులు లేకుండా కంచె వేయకూడదని పేర్కొంది. రంగారెడ్డి జిల్లా శేరిలింగంపల్లి మండలం ఖానామెట్‌లో 1.26 ఎకరాల భూమికి హైడ్రా కంచె వేసిన చర్యను సవాలు చేస్తూ సికింద్రాబాద్‌కు చెందిన ఎన్. సబిత దాఖలు చేసిన పిటిషన్‌పై జస్టిస్ శ్రవణ్ కుమార్ విచారణ చేపట్టారు. పిటిషనర్ తరఫున న్యాయవాది వాదిస్తూ, ఒక వ్యాపారవేత్త ఇచ్చిన సమాచారాన్ని ఆధారంగా తీసుకుని తమ భూమిని నిషేధిత జాబితాలో ఉందని పేర్కొంటూ కంచె వేసి, బోర్డులు కూడా ఏర్పాటు చేశారని తెలిపారు. తమ ఆస్తిలో జోక్యం చేసుకోవద్దని, ఇప్పటికే ఏర్పాటు చేసిన బోర్డులను తొలగించాలని కోర్టును అభ్యర్థించారు. వాదనలు విన్న న్యాయమూర్తి, కేవలం నిషేధిత జాబితా ఆధారంగా కంచె వేయడం చట్టవిరుద్ధమని పేర్కొన్నారు. ఈ విషయంపై జిల్లా కలెక్టర్ నుంచి పూర్తి వివరాలు తీసుకోవాలని ఆదేశించారు. అలాగే కంచె వేయడానికి ముందు ఆ భూమిపై ఏవైనా వివాదాలు లేదా కేసులు ఉన్నాయా అన్నది నిర్ధారించుకోవాలని పురపాలక శాఖ ముఖ్య కార్యదర్శికి సూచించారు. ఈ ఆదేశాలను వెంటనే అమలు చేయాలని హైడ్రాని ఆదేశించిన కోర్టు, ఉత్తర్వుల ప్రతులను హైడ్రా కమిషనర్‌తో పాటు ప్రభుత్వానికి పంపాలని రిజిస్ట్రీకి సూచించింది. కలెక్టర్‌ను ప్రతివాదిగా చేర్చాలని పిటిషనర్‌కు సూచిస్తూ విచారణను ఈ నెల 13కు వాయిదా వేసింది.

### "ఆకలితోనైనా చస్తాం..ఆత్మాభిమానం వదుకోలేం" అంటూ

# ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ రాజీనామా

**ప్రజాపక్షం/హైదరాబాద్:** తన ఉన్నతాధికారి అందరి మందు నన్ను "నువ్వు వెధవాతి వెధవవు, నువ్వు చేసిన వెధవ పనులు అంటూ.. నాకు సంబంధంలేనివి చదివాడు. నా జీవితంలో ఎన్నడు ఎదుర్కోని ఘోర అవమానం చేసాడు. నాతోనే నేను వెధవను అనిపించేలా ప్రయత్నం చేశాడు. అదే గదిలో నలుగురు అధికారులు, సిబ్బంది ఉన్నారు. ఆకలతోనైనా చస్తాం, ఆత్మాభిమానం వదుకోలేం అంటూ నిజామాబాద్‌కు చెందిన నిజామాబాద్ ఎక్సైజ్ డిప్యైటీ కమిషనర్ సోమిరెడ్డి బహిరంగ లేఖ రాసి తన ఉద్యోగానికి రాజీనామా చేసిన ఉదంతం హైదరాబాద్ ఎక్సైజ్ కార్యాయలంలో వెలుగు చూసింది. తాను రాజీనామా చేసిన వెంటనే కార్యాలయంలోనే కుప్పకూలి పోయాడు. తోటి సిబ్బంది వెంటనే అప్రమత్తమై అతన్ని ఆసుపత్రికి తరలించడంతో ప్రాణాలు దక్కాయి. తెలంగాణ ఎక్సైజ్ శాఖలో ఉన్నతాధికారుల మధ్య నెలకొన్న విభేదాలు తీవ్ర చర్చకు దారి తీసాయి. ఎక్సైజ్ కమిషనర్ హరి కిరణ్ తనను వ్యక్తిగతంగా లక్ష్యంగా చేసుకుని అవమానకరంగా ప్రవర్తించారని ఆరోపిస్తూ నిజామాబాద్ జిల్లా డిప్యూటీ కమిషనర్ సోమిరెడ్డి రాజీనామా ప్రకటించారు. సుమారు 30 ఏళ్ల సేవ అనంతరం ఈ నిర్ణయం తీసుకోవడం బాధాకరమే అయినప్పటికీ, ఆత్మాభిమానాన్ని కాపాడుకోవడానికి ఇదే మార్గమని సోమిరెడ్డి తెలిపారు. కమిషనర్ వ్యాఖ్యల వల్ల తీవ్ర మనస్తాపానికి గురై ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నట్లు వెల్లడించారు. ఈ మేరకు ప్రభుత్వానికి లేఖ రాసి తన రాజీనామాను సమర్పించినట్లు చెప్పారు. గురువారం అర్ధరాత్రి నాంపల్లి ఎక్సైజ్ కార్యాలయంలో జరిగిన బదిలీల సమావేశంలో ఈ ఘటన చోటు చేసుకున్నట్లు సమాచారం. సూపరింటెండెంట్ల బదిలీల విషయంలో తాను న్యాయంగా సూచనలు చేసినప్పటికీ, కమిషనర్ అనుచితంగా మాట్లాడారని సోమిరెడ్డి ఆరోపించారు. తనను మాత్రమే కాకుండా ఇతర సిబ్బందిపైనా ఇలాంటి వ్యాఖ్యలు తరచూ చేస్తున్నారని తెలిపారు.గత రెండేళ్లుగా కమిషనర్ వ్యవహారశైలి ఇదే విధంగా ఉందని, లోయర్ క్యాడర్ ఉద్యోగుల సమక్షంలో అవమానకరంగా మాట్లాడటం బాధ కలిగించిందని పేర్కొన్నారు. తప్పు చేయకపోయినా తిట్లు వినాల్సిన పరిస్థితుల్లో కొనసాగడం సాధ్యం కాదని, అందుకే ఉద్యోగానికి వీడ్కోలు చెప్పాలని నిర్ణయించుకున్నట్లు సోమిరెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు.ఈ వ్యవహారం ఎక్సైజ్ శాఖలో కలకలం రేపుతూ, అధికార వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది.ఇదిలావుండగా ఈ ఘటనకు తనకు ఎలాంటి సంబంధం లేదని ఎక్సైజ్ కమిషనర్ హరికిరణ్ ఒక ప్రకటనలో తెలిపారు.




# ఆటిజంపై అవగాహన

### నాణ్యమైన చికిత్సకు ప్రాధాన్యత ఇవ్వాలి : డాక్టర్ ఎ. లింగయ్య

**ప్రజాపక్షం/హైదరాబాద్:** ఆటిజంపై అవగాహన, తొలిదశ నిర్ధారణ, నాణ్యమైన చికిత్సకు ప్రాధాన్యత ఇవ్వాలని యశోద హాస్పిటల్స్ డైరెక్టర్ డాక్టర్ ఎ. లింగయ్య అన్నారు. ఆటిజం స్పెక్ట్రమ్ డిసార్డర్ (ఎడిఎస్)పై అవగాహన పెంపొందించడం, సమగ్ర సంరక్షణకు దారితీయడం లక్ష్యంగా యశోద హాస్పిటల్స్‌హైటెక్ సిటీలో నేషనల్ ఆటిజం స్టేక్ హోల్డర్స్ సమ్మిట్2026 నిర్వహించారు. ఏప్రిల్ 11, 12 తేదీల్లో జరుగుతున్న రెండు రోజుల సదస్సులో దేశవ్యాప్తంగా 500 మందికిపైగా నిపుణులు, పరిశోధకులు, థెరపిస్టులు, ఉపాధ్యాయులు, కుటుంబ సభ్యులు పాల్గొన్నారు. సదస్సును హైదరాబాద్ జిల్లా కలెక్టర్ హరిచందన దాసరి ప్రారంభించారు. ఆటిజం మానవ మేధస్సు వైవిధ్యానికి ప్రతిబింబమని, సమగ్ర విధానాలతో ముందుకు సాగాల్సిన అవసరం ఉందని ఆమె పేర్కొన్నారు. అదే సందర్భంగా చైల్డ్ డెవలప్‌మెంట్ సెంటర్ (సిడిసి)ను కూడా ప్రారంభించారు. న్యూరాలజిస్టు డాక్టర్ లోకేష్ లింగప్ప మాట్లాడుతూ ప్రారంభ దశలో జోక్యం పిల్లల అభివృద్ధికి కీలకమని తెలిపారు.


# చెరువుల్లో గుర్రపు డెక్క తొలగించాలి

### దోమల నియంత్రణలో ఫాగింగ్, లార్వా నివారణ చర్యలను సమర్థవంతంగా అమలు చేయాలి

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** రంగారెడ్డి జిల్లా సరూర్‌నగర్ చెరువులో పేరుకుపోయిన గుర్రపు డెక్కను వెంటనే తొలగించి, దోమల నివారణకు సమగ్ర చర్యలు చేపట్టాలని జీహెచ్‌ఎంసీకి హైకోర్టు ఆదేశించింది. సరూర్‌నగర్ చెరువుతో పాటు జీహెచ్‌ఎంసీ పరిధిలోని ఇతర చెరువులన్నింటిలోనూ ఇలాంటి మలినాలను తొలగించేందుకు చర్యలు తీసుకోవాలని సూచించింది. చెరువుల్లో పేరుకుపోయే గుర్రపు డెక్క వల్ల దోమలు విస్తరించి ప్రజారోగ్యానికి ముప్పు ఏర్పడుతోందని కోర్టు పేర్కొంది.

దోమల నియంత్రణలో భాగంగా ఫాగింగ్, లార్వా నివారణ చర్యలను సమర్థవంతంగా అమలు చేయాలని, ఈ పనుల పర్యవేక్షణ కోసం ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేయాలని ఆదేశించింది. చేపట్టిన చర్యలపై వివరాలతో కూడిన నివేదిక సమర్పించాలని కోరుతూ విచారణను ఈ నెల 16కు వాయిదా వేసింది. సరూర్‌నగర్ చెరువులో గుర్రపు డెక్క సమస్యపై పలుమార్లు ఫిర్యాదులు చేసినా స్పందన రాలేదని సైదాబాద్‌కు చెందిన డి. కీర్తికిరణ్ దాఖలు చేసిన పిటిషన్‌పై జస్టిస్ ఎన్.వి. శ్రవణ్ కుమార్ విచారణ జరిపారు.

పిటిషనర్ తరఫు న్యాయవాది వాదిస్తూ, సరూర్‌నగర్ ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి అసెంబ్లీలోనే ఈ సమస్యను ప్రస్తావించినప్పటికీ అధికారులు చర్యలు తీసుకోలేదని తెలిపారు. దోమల సంఖ్య అధికమవడంతో ఆ ప్రాంతంలో నివాస పరిస్థితులు దెబ్బతిన్నాయని వివరించారు. పిటిషనర్ సమర్పించిన ఫొటోలను పరిశీలించిన న్యాయమూర్తి, ప్రజాప్రతినిధి అసెంబ్లీలో సమస్యను ప్రస్తావించినా అధికారులు స్పందించకపోవడం పట్ల ఆశ్చర్యం వ్యక్తం చేశారు. పట్టణ నిర్వహణలో భాగంగా చెరువుల శుభ్రతకు కూడా ప్రాధాన్యత ఇవ్వాల్సిన బాధ్యత హైడ్రాపై ఉందని వ్యాఖ్యానించారు. సరూర్‌నగర్ చెరువులో గుర్రపు డెక్క తొలగింపుపై స్థితిగతుల నివేదిక సమర్పించాలని జీహెచ్‌ఎంసీని ఆదేశిస్తూ విచారణను ఈ నెల 16కు వాయిదా వేశారు.



### జ్యోతిబా పూలేకు

# భారతరత్న ఇవ్వాలి

### టిడిపి సికింద్రాబాద్ నేతలు కిషోర్, బాల్‌రాజ్ గౌడ్

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** సామాజిక విప్లవకారుడు, బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి మహాత్మా జ్యోతిబా పూలే 200వ జయంతి వేడుకలు జిల్లా పార్టీ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సికింద్రాబాద్ పార్లమెంట్ నాయకులు నల్లెల్ల కిషోర్, పి. బలరాజ్ గౌడ్ పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా కిషోర్, బాల్‌రాజ్ గౌడ్ మాట్లాడుతూ సమాజంలో అణగారిన వర్గాల కోసం పోరాడిన ప్రథమ సంఘ సంస్కర్త పూలే అని కొనియాడారు. సత్యశోధక్ సమాజ్ ద్వారా అంటరానితనంపై పోరాడటమే కాకుండా, తన సతీమణి సావిత్రిబాయి పూలేతో కలిసి మహిళా విద్య కోసం వారు చేసిన కృషి అమోఘమన్నారు. పూలే ఆశయాలే డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ వంటి మహనీయులను ప్రభావితం చేశాయన్నారు. బడుగు బలహీన వర్గాలకు రాజకీయ అధికారం దక్కాలన్నదే పూలే సంకల్పమని, ఆ దిశగా తెలుగుదేశం పార్టీ ఎల్లప్పుడూ కృషి చేస్తోందన్నారు. నాడు ఎన్‌టిఆర్ చేపట్టిన సంక్షేమ పథకాలు, నేడు చంద్రబాబు చేస్తున్న అభివృద్ధి కార్యక్రమాలు పూలే ఆశయ సాధనకు నిదర్శనమన్నారు. దేశానికి పూలే చేసిన సేవలను గుర్తించి ఆయనకు తక్షణమే భారతరత్న పురస్కారాన్ని ప్రకటించాలని నాయకులు కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు పరశురామ్, శ్యామ్ సుందర్, భాను ప్రకాష్, సి.హెచ్. ప్రదీప్ గౌడ్, ఎస్. ప్రకాష్, సత్తన్న, బి. రాజు, ఆనంద్ పాల్గొన్నారు.

# మహిళలకు కాంగ్రెస్ పెద్దపీట

### టిపిసిసి అధికార ప్రతినిధి డాక్టర్ లింగం యాదవ్

**ప్రజాపక్షం/హైదరాబాద్:** తెలంగాణలో మహిళల అభివృద్ధికి కాంగ్రెస్ ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని, మహిళా రిజర్వేషన్ ఆలోచన దేశంలో మొదటగా కాంగ్రెస్ పార్టీదేనని టిపిసిసి అధికార ప్రతినిధి డాక్టర్ లింగం యాదవ్ పేర్కొన్నారు. గాంధీభవన్‌లో శనివారం ఆయన మీడియా సమావేశంలో మాట్లాడుతూ 2008లోనే మహిళా రిజర్వేషన్ బిల్లును తీసుకొచ్చిన ఘనత కాంగ్రెస్‌కే దక్కుతుందని తెలిపారు. మహిళలకు ప్రధానమంత్రి, రాష్ట్రపతి, లోక్‌సభ స్పీకర్ వంటి అత్యున్నత పదవులు ఇచ్చిన పార్టీ కూడా కాంగ్రెసే అని అన్నారు. ప్రస్తుతం మహిళా రిజర్వేషన్ బిల్లుకు కాంగ్రెస్ పూర్తి మద్దతు ఇస్తుందని స్పష్టం చేసిన లింగం యాదవ్, ఒబిసి మహిళలకు ప్రత్యేక కోటా కల్పించాలని కేంద్రంలోని మోదీ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. జనగణనలో కుల గణన నిర్వహించి, దాని ఆధారంగా మహిళా రిజర్వేషన్‌లో బిసి మహిళలకు న్యాయం చేయాలని సూచించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో తెలంగాణలో మహిళలకు తగిన ప్రాధాన్యత కల్పిస్తూ ప్రజా ప్రభుత్వం ముందుకు సాగుతోందని ఆయన అన్నారు. పిసిసి అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ కూడా పార్టీ కమిటీల్లో మహిళలకు అధిక ప్రాధాన్యత ఇచ్చిన విషయాన్ని గుర్తుచేశారు. మహాత్మ జ్యోతిరావు పూలే ఆశయాలకు అనుగుణంగా కాంగ్రెస్ పాలన కొనసాగుతోందని, అదే దిశగా కేంద్ర ప్రభుత్వం కూడా చర్యలు తీసుకోవాలని లింగం యాదవ్ కోరారు.

# ఇలాపూర్ తాండ కూల్చివేతలపై స్టేటస్‌కో

### సెలవుల్లోనే కూల్చివేతలపై అసంతృప్తి

### నోటీసులు ఇవ్వకుండా కూల్చివేతలు వద్దు


### హౌస్‌మోషన్ పిటిషన్‌పై హైకోర్టు మధ్యంతర ఆదేశాలు

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** సంగారెడ్డి జిల్లా అమీన్‌పూర్ మండలం ఇలాపూర్ తండాలో ఇళ్ల కూల్చివేత ప్రయత్నాలపై తెలంగాణ హైకోర్టు స్టేటస్ కో (యథాతథ స్థితి) ఉత్తర్వులు జారీ చేసింది. న్యాయమూర్తి జస్టిస్ విజయసేన్ రెడ్డి ఈ మేరకు శనివారం తన ఇంటి వద్ద విచారణ జరిపిన అనంతరం మధ్యంతర ఆదేశాలు వెలువరించారు. గజ్జా రంగా రావు సహా 12 మంది పిటిషనర్లు దాఖలు చేసిన రిట్ పిటిషన్‌లో, తమ ఇళ్లను ఎలాంటి ముందస్తు నోటీసు లేకుండా కూల్చివేయడానికి అధికారులు తీసుకునే చర్యలను అడ్డుకోవాలని కోరారు. ఇలాపూర్ తండాలోని సర్వే నం.119 పరిధిలో తమ ఇళ్లు దశాబ్దాలుగా ఉన్నాయని, పూర్వీకుల కాలం నుంచే నివసిస్తున్నామని, 1956 నుంచే ఆ భూముల్లో ఉంటున్నారని తెలిపారు. పన్నులు, విద్యుత్, నీటి బిల్లులు క్రమం తప్పకుండా చెల్లిస్తున్నప్పటికీ, అకస్మాత్తుగా హైడ్రా యంత్రాంగం బలవంతంగా ఖాళీ చేయించే ప్రయత్నం చేస్తోందని కోర్టు దృష్టికి తీసుకువచ్చారు. శనివారం తెల్లవారుజామున భారీ సంఖ్యలో హైడ్రా, పోలీసు సిబ్బంది బుల్డోజర్లు, జేసీబీలతో అక్కడికి చేరుకుని కూల్చివేతకు సిద్ధమయ్యారన్నారు ఎలాంటి నోటీసు ఇవ్వకుండా, తమ వాదనలు వినకుండా చర్యలు చేపట్టారని వాదించారు. ఈ వాదనలపై స్పందించిన న్యాయమూర్తి.. అక్రమ నిర్మాణాలంటూ కూల్చివేతలను సెలవుల్లోనే ఎందుకు చేపడతారంటూ హైడ్రాను ప్రశ్నించారు. సెలవు రోజుల్లో కూల్చివేతలు ఎందుకు చేయాలని ప్రశ్నించారు. నోటీసులు ఇవ్వకుండా ఎలా చర్యలు తీసుకుంటారని అడిగారు బుల్డ్‌జర్ కేసులో ఇటీవల సుప్రీం కోర్టు స్పష్టత ఇచ్చినా హైడ్రా వైఖరిలో మార్పు ఎందుకు రావడం లేదన్నారు. ఇలాపూర్ తాండ కూల్చివేతలపై యథాతథస్థితిని కొనసాగించాలని మధ్యంతర ఉత్తర్వులను వెలువరించారు.

పిటిషన్‌లో..

ఇలాపూర్ తాండలో సర్వే నెం.119లో సుమారు 3 వేల మంది ఉన్నారు. వంద గజాల జాగాలోనే నివాసం ఉండే పేదవాళ్లు. రోజూ కూలిపనులు చేసుకునేవాళ్లు. నిరక్షరాస్యులు. పూర్వీకుల నుంచి వచ్చిన స్థలాల్లో ఇళ్లు నిర్మించుకుని జీవిస్తున్నారు. ఇళ్లకు విద్యుత్తు, నీటి పన్నులు చెల్లిస్తున్నారు. ఎలాంటి సమాచారం, నోటీసు లేకుండా శనివారం తెల్లవారు జామున 2 గంటలప్పుడు హైడ్రా 3వేల మందితో వచ్చి కూల్చివేత చర్యలు చేపట్టింది. హైడ్రాకు చెందిన డీఆర్‌ఎఫ్ సిబ్బంది ఆయుధాలు, బుల్‌డోజర్లు, జెసీబీలు, ఇతర యంత్రాలతో కూల్చివేత చర్యలు మొదలుపెట్టారు. బలప్రయోగంతో ఖాళీ చేయిస్తున్నారు.. అని పేర్కొన్నారు. దీనిపై న్యాయమూర్తి.. ఇలాపూర్ తాండ సర్వే నెం.119లో స్టేటస్‌కో కొనసాగించాలని హైడ్రాకు ఆదేశాలిచ్చింది. ప్రతివాదులకు నోటీసులు ఇచ్చింది. విచారణను వాయిదా వేసింది.

## బిసి సంఘాల బలోపేతం, సాధికారతకు కృషిచేయాలి




ప్రజాపక్షం/ఎల్‌బి నగర్ : రాష్ట్రంలో బిసి సంఘాల బలోపేతం కోసం బిసి సాధికారత, బిసి రాజ్యాధికారం దిశగా రాష్ట్ర వ్యాప్తంగా, దేశవ్యాప్తంగా బిసి కులగణన సాధన మహిళా రిజర్వేషన్లలో బిసిమహిళా సబ్ కోటాలో 42శాతం రిజర్వేషన్ సాధన దిశగా ప్రభుత్వం కృషి చేసే విధంగా చొరవ చూపాలని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, మాజీ ఎంపి వి.హనుమంతరావుకు బిసి సంఘాల రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ ముద్దగౌని సతీష్ కుమార్‌గౌడ్ శనివారం వినతిపత్రం అందచేశారు.

## లక్ష్మీ నరసింహస్వామి బ్రహోత్సవాలు



ప్రజాపక్షం/ఎల్‌బి నగర్ : బియన్‌రెడ్డి నగర్ డివిజన్ పరిధిలోని ఎస్‌కేడి నగర్‌లో శ్రీశ్రీ లక్ష్మీ నరసింహస్వామి వారి 14వ వార్షికోత్సవ బ్రహోత్సవాలను శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నదానం కార్యక్రమం చేపట్టారు. కార్యక్రమంలో కటికరెడ్డి అవింద్‌రెడ్డి ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

### వార్షికోత్సవంలో పాల్గొన్న మాజీ కార్పొరేటర్ లచ్చిరెడ్డి

శ్రీలక్ష్మీ నరసింహస్వామి వారి బ్రహోత్సవాల్లో బియన్‌రెడ్డి నగర్ డివిజన్ మాజీ కార్పొరేటర్ మొద్దు లచ్చిరెడ్డి పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో సామ రంగారెడ్డి, ఆలయ చైర్మన్ సోమిరెడ్డి, కాలనీ కన్వీనర్ పుల్లారెడ్డి, గౌరవ అధ్యక్షులు సుధాకర్‌రెడ్డి, కాలనీ అధ్యక్షులు అమరేందర్‌రెడ్డి, కార్యదర్శి శ్రీధర్‌రావు, పాపారావు, వెంకటరమణ, ఇందిరారెడ్డి, రమారెడ్డి, వెంకట్రావు,గోపాల్ రావు, నారాయణ పాల్గొన్నారు.

## ఆదర్శ గ్రామంగా అభివృద్ధే లక్ష్యం




ప్రజాపక్షం/ఫరూఖ్‌నగర్: ఆదర్శ గ్రామంగా అభివృద్ధి చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామని సర్పంచ్ ఎంసి ప్రవీణ్‌కుమార్ అన్నారు. శనివారం ఫరూఖ్‌నగర్ మండల పరిధిలోని లింగారెడ్డిగూడ గ్రామంలో రూ.10లక్షలతో చేపడుతున్న అండర్ గ్రౌండ్ డ్రైనేజీ నిర్మాణ పనులను సర్పంచ్ ప్రవీణ్‌కుమార్, ఉప సర్పంచ్ ఎర్రోళ్ల అశోక్‌లు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ సహకారంతో లింగారెడ్డిగూడ గ్రామాన్ని ఆదర్శంగా అభివృద్ధి చేయాలన్నదే లక్ష్యంగా పనిచేస్తామని వివరించారు. కార్యక్రమంలో చల్లా శ్రీకాంత్‌రెడ్డి, చల్లా వెంకటేశ్వర్‌రెడ్డి, వార్డు సభ్యులు వట్టెల మల్లేష్, దీపిక వీరేష్ గౌడ్, ఎర్రోళ్ల మమత, అరుణ్‌కుమార్, శశాంక్‌గౌడ్, మాధవి, గణేష్, బాలమణి, కందూరి అంజయ్య గౌడ్, పంతుల లక్ష్మయ్య, అప్పన్నగారి భాస్కర్‌రెడ్డి, గోదా రమేష్ యాదవ్, నరేందర్‌రెడ్డి, పకీర్‌బాషాలు పాల్గొన్నారు.

## ప్రజల దాహార్తిని తీర్చేందుకే చలివేంద్రం ఏర్పాటు




ప్రజాపక్షం/కొత్తూరు: వేసవి కాలం..ఎండల తీవ్రతను దృష్టిలో పెట్టుకొని ప్రజల దాహార్తిని తీర్చేందుకు చలివేంద్రం ఏర్పాటు చేసినట్లు మామిడిపల్లి సర్పంచ్ మొత్కురు హన్మంత్‌రెడ్డి వివరించారు. శనివారం నందిగామ మండల పరిధిలోని మామిడిపల్లి గ్రామంలో ఏర్పాటు చేసిన సర్పంచ్ హన్మంత్‌రెడ్డి, ఉప సర్పంచ్ మామిళ్ళపల్లి రాజు ప్రారంభించారు. ఈ సందర్భంగా సర్పంచ్ హన్మంత్‌రెడ్డి మాట్లాడుతూ సమాజ సేవ చేసేందుకు నేటి యువత ముందుకు రావాల్సిన అవసరం ఎంతైనా ఉందని పేర్కొన్నారు. కార్యక్రమంలో వార్డు సభ్యుడు ప్రభాకర్, మాజీ సర్పంచ్ శ్రీనివాస్, మాజీ ఉప సర్పంచ్ ఉడత సత్యనారాయణతోపాటు గ్రామస్తులు పాల్గొన్నారు.

## దేవాలయ అభివృద్ధికి విరాళం



ప్రజాపక్షం/ఫరూఖ్‌నగర్: శ్రీ కట్టమైసమ్మ దేవాలయ అభివృద్ధికి నల్లమోని బిక్షపతి ఒక లక్ష రూపాయలు విరాళంగా అంధించారు. శనివారం షాద్‌నగర్ మున్సిపల్ పరిధిలోని 22,23వార్డుల్లో ఉన్న శ్రీ కట్ట మైసమ్మ దేవాలయం అభివృద్ధి కోసం దాత నల్లమోని బిక్షపతి ముదిరాజ్ భారీ విరాళం అంధించారు. ఈ సందర్భంగా దాత బిక్షపతి ముదిరాజ్ మాట్లాడుతూ కొలిచే భక్తుల పాలిట కొంగుబంగారంగా నిలుస్తున్న శ్రీ కట్ట మైసమ్మ అమ్మవారి ఆశీస్సులు ప్రజలందరిపై ఉండాలని వేడుకున్నట్లు తెలిపారు. అమ్మవారిని నమ్ముకొని పనులు చేస్తే లక్ష్యం నేరవేరడం ఖాయమని వివరించారు. ఆపదలో ఉన్న వారికి అమ్మవారు ఎల్లప్పుడు వారి వెంట ఉండి ఆపదలను తొలగిస్తూ అనుకున్న పనులు పూర్తి అయ్యేలా భక్తులను ఆశీర్వదిస్తుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో విరాళ దాత బిక్షపతి ముదిరాజ్, దేవాలయ కమిటి అధ్యక్షుడు నల్లమోని శ్రీధర్, కమిటి సభ్యులు జిటి సంతోష్, అందె రాజేశ్వర్, రమేష్ నాయి, సురేష్ నాయి, అందె జంగరాజు, శ్రీకాంత్ గౌడ్, సంగమేష్, తరుణ్, శ్రీశైలంలు పాల్గొన్నారు.

# సమస్యల పరిష్కారానికి అలుపెరుగని పోరాటం

### సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు బాల నరసింహ్మా




ప్రజాపక్షం/రంగారెడ్డి: ప్రజా సమస్యల పరిష్కారం కోసం నిరంతరం అలుపెరుగని పోరాటాలు చేసేది కమ్యూనిస్టులు మాత్రమేనని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు ఎం.బాలనరసింహ్మా అన్నారు. శనివారం రంగారెడ్డి జిల్లా మాడుగుల మాడ్గుల్, ఆమనగల్ మండలాల ముఖ్య కార్యకర్తల సమావేశం మాల్ కేంద్రంలో సిపిఐ రాష్ట్ర సమితి సభ్యుడు పానుగంటి పర్వతాలు అధ్యక్షతన జరిగింది. సమావేశానికి ముఖ్య అతిథులుగా బాల నరసింహ్మా, సిపిఐ రంగారెడ్డి జిల్లా కార్యదర్శి పాలమాకుల జంగయ్య, మాజీ ఎమ్మెల్యే ఉజ్జని యాదగిరిరావు హాజరయ్యారు. ఈ సందర్భంగా బాలనరసింహ్మా మాట్లాడుతూ గతంలో కమ్యూనిస్టు పార్టీలో పనిచేసిన ప్రసాద్ యాదయ్య, కాంగ్రెస్ పార్టీ నాయకుడు కృష్ణమాచారి పార్టీలో చేరడం శుభపరిణామన్నారు. మాడ్గుల్, ఆమనగల్ మండలాలలో కమ్యూనిస్టు పార్టీ, అనుబంధ సంఘాల ను విస్తరించడం కోసం నిరంతరం ప్రజలలో మమేకమై పని చేయాలని ఆయన కార్యకర్తలకు సూచించారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల ప్రజా వ్యతిరేక విధానాలపై రాబోయే కాలంలో పోరాటాలు నిర్వహించడానికి కార్యకర్తలు సిద్ధంగా ఉండాలని ఆయన తెలిపారు. సిపిఐ రంగారెడ్డి జిల్లా కార్యదర్శి పాలమాకుల జంగయ్య మాట్లాడుతూ సిపిఐలో ఇతర పార్టీల నుండి చేరడం సంతోషకరమైన విషయమని తెలిపారు. గ్రామాలలో ప్రజా సమస్యలు తెలుసుకోవడానికి నిరంతరం ప్రజలలో ఉండి పనిచేయాలని పార్టీ పట్ల ప్రజలకు నమ్మకాన్ని కలిగించే విధంగా పనిచేయాలని ఆయన సూచించారు. సమావేశంలో సిపిఐ నాయకులు డాక్టర్ శ్రీను, రంగారెడ్డి, లక్ష్మణాచారి, శివశంకర్, టి.ప్రసాద్, టి.యాదయ్య తదితరులు పాల్గొన్నారు.

## కులవ్యవస్థ రద్దుకు పోరాడిన పూలే

### సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఆందోజు రవీంద్రచారి

ప్రజాపక్షం/రంగారెడ్డి: అంటరాని తనం, కుల వ్యవస్థ రద్దు కోసం పోరాడిని మహనీయుడు పూలే అని సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఆందోజు రవీంద్ర చారి అన్నారు. శనివారం మహాత్మ జ్యోతి రావు పూలే జయంతిని సిపిఐ అబ్దుల్లాపూర్ మెట్ మండల సమితి ఆధ్వర్యంలో రావి నారాయణ రెడ్డి కాలనీ ఫజ్ 2 సిపిఐ కార్యాలయంలో సిపిఐ మండల కార్యదర్శి అజ్మీరా హరిసింగ్ నాయక్ అధ్యక్షతన నిర్వహించారు. నివాళి కార్యక్రమానికి రవీంద్ర చారి, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు ముత్యాల యాదిరెడ్డి హాజరయ్యారు. ఈ సందర్బంగా వారు మాట్లాడుతూ మహిళల విద్య అవసరం అని గుర్తించి, తన భార్య సావిత్రి భాయి పూలేని దేశంలోనే మొట్ట మొదటి మహిళా ఉపాధ్యాయురాలిని చేసిన గొప్ప వ్యక్తి జ్యోతి రావు పూలే అని అన్నారు. కార్యక్రమంలో సిపిఐ జిల్లా నాయకులు పబ్బతి లక్ష్మణ్, అరుణ, శేఖర్, పొన్నాల యాదగిరి, నర్సింహా, యాదగిరి, మధు, వినోద్ నాయక్, ఈశ్వరయ్య,నిరంజన్, సైదులు ముదిరాజ్, యాదగిరి, ఆటో రాములు, చిర్రా కవిత, సుజాత, వీరేష్, కొత్తూరు సుభద్ర, మహేందర్, అచ్చు నారాయణ, వెంకటయ్య, పాల్గొన్నారు.

# మహిళా విద్య మార్గదర్శకులు పూలే

### బిసి సంక్షేమ అధికారి కేశురామ్



ప్రజాపక్షం/రంగారెడ్డి : బడుగు బలహీన వర్గాల అభ్యున్నతికి, మహిళా విద్యకు మార్గదర్శకులు మహాత్మా జ్యోతిబా పూలే అని బిసి సంక్షేమ అధికారి బి.కేశురామ్ అన్నారు. శనివారం మహాత్మా జ్యోతిబాపూలే జయంతి సందర్బంగా సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయ భవనంలోని జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో వారి కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో బిసి సంక్షేమ అధికారి కేషు రాం, బిసి సంఘం నాయకులతో కలిసి జ్యోతి ప్రజ్వలన చేసి మహాత్మా జ్యోతిబా పూలే చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. బడుగు బలహీనవర్గాల అభ్యున్నతికి, మహిళా విద్యకు మార్గదర్శకులు మహాత్మా జ్యోతిబా పూలే అన్నారు. నేటితరం పూలే ఆశయాలను స్ఫూర్తిగా తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర బిసి ఫ్రంట్ చైర్మన్ జి మల్లేష్ యాదవ్, రంగారెడ్డి జిల్లా బిసి ఫ్రంట్ అధ్యక్షులు కె.కృష్ణ యాదవ్, జంగయ్య, బిసి వెల్ఫేర్ శాఖ సిబ్బంది, హాస్టల్ వార్డెన్స్, తదితరులు పాల్గొన్నారు.

### ఫార్మాసిటీకి భూములు ఇవ్వని

# రైతుల సమస్యలు పరిష్కరిస్తాం

### రాష్ట్ర రైతు కమిషన్ చైర్మన్ ముదిరెడ్డి కోదండరెడ్డి



ప్రజాపక్షం/యాచారం : ఫార్మసిటీకి భూములు ఇవ్వని రైతుల సమస్యలను పరిష్కరించడానికి కృషి చేస్తామని తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ శాఖ కమిషన్ చైర్మన్ ముదిరెడ్డి కోదండరెడ్డి, భువనగిరి ఎంపి చామల కిరణ్‌కుమార్‌రెడ్డి రైతులకు హామీ ఇచ్చారు. శనివారం యాచారం మండల కేంద్రంలో జరిగిన కార్యక్రమానికి హాజరైన రైతు కమిషన్ చైర్మన్ కోదండారెడ్డి, ఎంపి చామల కిరణ్‌కుమార్‌కు తమ సమస్యలను రైతులు వివరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఫార్మసిటీకి చెందిన రైతుల సమస్యలను హుఖ్యమంత్రితో మాట్లాడి సమస్యను పరిష్కరించడానికి తమ వంతుగా కృషి చేస్తామన్నారు. రైతుల భూములను అన్‌లైన్‌లో ఎక్కించడానికి కృషి చేస్తున్నామని వారు తెలిపారు. మేడిపల్లి, నానక్‌నగర్, తాడిపర్తి, కుర్మిద్ద గ్రామాలకు చెందిన 2000 వేల ఎకరాల భూములను రైతులు ఫార్మాసిటి ఇవ్వలేదని తెల్చి చేప్పారు. ప్రతి గ్రామంలో దాదాపు 500 ఎకరాల్లో రైతులు సేద్యం చేస్తు జీవనం సాగిస్తున్నారని తెలిపారు. రైతులను ఇబ్బందులుకు గురికాకుండా చూస్తామన్నారు. ఇబ్రహింపట్నం శాసన సభ్యులు మల్‌రెడ్డి రంగారెడ్డి, జిల్లా ఇన్‌చార్జి మంత్రి శ్రీధర్ బాబుతోమాట్లాడి రైతుల సమస్యలను పరిష్కరిస్తానని తెలిపారు. ప్రభుత్వం మొండిగా వ్యవహరిస్తే రైతులు జీవనోపాధి కోల్పోయే పరిస్థితి ఉందన్నారు. రైతులకు న్యాయం చేయాలని కోరారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్‌లు ముత్యాల వెంకట్‌రెడ్డి, బందె రాజశేఖర్‌రెడ్డి, దూస రమేశ్, ఫార్మా వ్యతిరేక ఉద్యమ నాయకులు కానమోని గణేశ్, మహిపాల్‌రెడ్డి పాల్గొన్నారు.

## న్యాయవాదుల సంక్షేమానికి సహాయ సహకారాలు అందిస్తా

### ఎమ్మెల్సీ నాగర్‌కుంట నవీన్‌కుమార్‌రెడ్డి

ప్రజాపక్షం/షాద్‌నగర్: న్యాయవాదుల అభివృద్ధికి తనవంతుగా సహాయ సహకారాలు అంధించేందుకు కృషి చేస్తానని ఎమ్మెల్సీ నాగర్‌కుంట నవీన్‌కుమార్ రెడ్డి వివరించారు. శనివారం పట్టణంలోని ఎమ్మెల్సీ క్యాంపు కార్యాలయంలో షాద్‌నగర్ బార్ అసోసియేషన్ నూతన అధ్యక్షుడిగా ఎన్నికైన బి.జగన్మోహన్‌రెడ్డితోపాలు నూతన కమిటీ సభ్యులు ఎమ్మెల్సీ నవీన్‌కుమార్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. నూతన సభ్యులను పూలమాలలు, శాలువాలతో సన్మానించారు. ఈ సందర్బంగా ఎమ్మెల్సీ నవీన్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ న్యాయవాదుల అభివృద్ధికి, సంక్షేమానికి, బార్ అసోసియేషన్ అభివృద్ధికి తన వంతుగా సహయ సహకారాలు అంధించేందుకు కృషి చేస్తానని పేర్కొన్నారు. న్యాయవాదులు ఏ సమస్యలు ఉన్నా తన దృష్టికి తీసుకువస్తే పరిష్కరించేందుకు తగిన చర్యలు తీసుకుంటామని వివరించారు. నమ్ముకున్న ప్రజలకు న్యాయం చేసేందుకు న్యాయవాదులు కృషి చేయాలని ఆకాంక్షించారు. అప్పుడే సమాజంలో పేరు ప్రతిష్టలు వచ్చే అస్కారం ఉంటుందని అన్నారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ ప్రధానకార్యదర్శి శ్రీనివాసమూర్తి, సంయుక్త కార్యదర్శి శ్రీకాంత్ గౌడ్, క్రీడలు, సాంస్కృతిక కార్యదర్శి శంకర్, పెబ్బేర్ శ్రీశైలం, విజయ్ కుమార్ గౌడ్, గంజాయి నర్సింలు, నరేష్‌కుమార్, పోమాల్‌పల్లి సర్పంచ్ స్వప్న భూపాల్‌రెడ్డి, మాజీ సర్పంచ్ తాండ్ర విష్ణువర్ధన్‌రెడ్డి పాల్గొన్నారు.



## హోప్ ఫౌండేషన్ స్వచ్ఛంధ సేవలు అభినందనీయం

ప్రజాపక్షం/మియాపూర్: హోప్ ఫౌండేషన్ చైర్మన్ కొండ విజయ్ కుమార్ సేవలు మరవలేనివి అని, సమాజానికి తనవంతుగా మానవత దృక్పథంతో అన్నదానంతో పాటు అనేక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారని, హోప్ సేవలు భేష్ అని, అన్న ధాన కార్యక్రమంలో పాల్గొన్న స్థానికులు అభినందించారు. ప్రతి వారం నిర్వహిచే అన్నదాన కార్యక్రమంలో భాగంగా శనివారం అన్న వితరణ కార్యక్రమం గంగారంలోని హోప్ కార్యాలయం ఆవరణలో నిర్వహించి విజయకుమార్ పాల్గొని ప్రజలకు అన్న ప్రసాదాలు అందజేశారు.

# ఘనంగా మహాత్మా జ్యోతిరావు పూలే జయంతి




ప్రజాపక్షం/ఎల్‌బి నగర్ : బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతి కోసం, అంటరానితనం, కులవివక్ష నిర్మూలనకు కృషి చేసిన మహనీయుడు మహాత్మాజ్యోతిరావు పూలే అని సిపిఐ రంగారెడ్డి జిల్లా కార్యవర్గ సభ్యులు బాతరాజు నరసింహ అన్నారు. ఆదివారం సిపిఐ సరూర్‌నగర్ మండల కమిటీ ఆధ్వర్యంలో పూలే జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. కార్యక్రమంలో ఎఐటియుసి రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు మారగోని ప్రవీణ్ కుమార్ గౌడ్, సిపిఐ రంగారెడ్డి జిల్లా సమితి సభ్యులు రమావత్ సక్రు నాయక్, ఎండి మహబూద్, ఇస్మాయిల్, ఉష, జాహద్, భాగ్యమ్మ, కృష్ణవేణి తదితరులు పాల్గొన్నారు.

### నివాళి అర్పించిన ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

దేశంలో తొలితరం సామాజిక విప్లవకారుడు, బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి, సంఘ సంస్కర్త మహాత్మా జ్యోతిరావే పూలే అని ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి కొనియాడారు. ఎల్‌బి నగర్ చౌరస్తాలో పూలే విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు జక్కిడి రఘువీర్‌రెడ్డి పాల్గొన్నారు.

### సంఘ సంస్కర్త జ్యోతిరావు పూలే

### ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

షాద్‌నగర్: సంఘ సంస్కర్త.. సామాజిక వేత్త.. విద్యా ప్రధాత మహాత్మా జ్యోతిరావు పూలే అని షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. శనివారం షాద్‌నగర్ పట్టణంలో మహాత్మా జ్యోతిరావు పూలే జయంతి సందర్భంగా పూలే విగ్రహానికి వివిధ రాజకీయ పార్టీల శ్రేణులు, కుల సంఘాలు, ప్రజా సంఘాల నేతలు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ ఎంపిడిఓ కార్యాలయం ముందు ఉన్న పూలే విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ మాట్లాడుతూ సమాజంలో అణగారిన వర్గాల అభ్యున్నతికి, విద్యాభివృద్ధికి కృషి చేసిన గొప్ప సంఘ సంస్కర్త పూలే అని కొనియాడారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ బసవేశ్వర్ అప్ప, వైస్ చైర్మన్ అందె మోహన్ ముదిరాజ్, మార్కెట్ కమిటీ డైరెక్టర్ కరుణాకర్, టిజెఎసి చైర్మన్ జనార్ధన్, బాదేపల్లి సిద్దార్థ, రఘునాయక్, నక్క బాల్‌రాజ్, చెంది తిరుపతిరెడ్డి, కౌన్సిలర్లు కొప్పునూరి ప్రవీణ్, దిలీప్, మురళిమోహన్, నేతలు ముబారక్, సుజీవన్, బాల్‌రాజ్ గౌడ్, శ్రీనునాయక్, యువసత్తా లక్ష్మణ్‌కుమార్, జంగారి రవి, రవీంధ్రనాథ్, అర్జున్, బీసి జనసేన జాతీయ అధ్యక్షుడు కత్తి చంద్రశేఖర్ అప్ప, జలజ, స్రవంతి రాజ్, చందులాల్, అనురాధ, రాధమ్మ, పుష్ప, సత్తయ్యలు పాల్గొన్నారు.

### పూలే ఆశయ సాధనకు కృషి చేయాలి

మహాత్మా జ్యోతిరావు పూలే ఆశయ సాధన కోసం కృషి చేయాలని మాజీ జడ్పిటిసి పి.వెంకట్‌రాంరెడ్డి అన్నారు. ఎంపిడిఓ కార్యాలయం ముందు ఉన్న పూలే విగ్రహానికి ఆయన పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఉద్యమకారుల సంక్షేమ సంఘం నేతలు శ్రీనివాస్‌రెడ్డి, రాజ్యలక్ష్మీ, విజయమ్మ, జాంగారి నర్సింలు, దొడ్డి రవీందర్, రవికుమార్ గౌడ్, అద్దెట్ల రాజు, మేకల వెంకటేష్, రాఘవేందర్, అల్లాడ శేఖర్‌లు పాల్గొన్నారు.

### పూలే అడుగు జాడల్లో నడవాలి

### మాజీ ఎమ్మెల్యే అంజయ్య యాదవ్

మహాత్మా జ్యోతిరావు పూలే అడుగు జాడల్లో నడవాలని మాజీ ఎమ్మెల్యే అంజయ్య యాదవ్ అన్నారు. పూలే విగ్రహానికి పూల మాలలు వేసి నివాళ్ళు అర్పించారు. కార్యక్రమంలో నాయకులు వి.నారాయణరెడ్డి, నరేందర్, నటరాజన్, ఈట గణేష్, దేవేందర్ యాదవ్, కడెంపల్లి శ్రీనివాస్ గౌడ్, మాజీ కౌన్సిలర్లు ప్రతాప్‌రెడ్డి, కానుగు అనంతయ్య, మాజీ కోఆప్షన్ సభ్యుడు కిశోర్ పాల్గొన్నారు

### స్త్రీ విద్య ఔనత్యాన్ని గుర్తించిన మహావ్యక్తి

కేశంపేట: సమాజ అభివృద్ధికి స్త్రీ విద్య ఎంతో ఉపయోగపడుతుందని భావించిన మహావ్యక్తి మహాత్మ జ్యోతిరావు పూలే అని ధర్మ సమాజ్ పార్టీ మండల అధ్యక్షుడు మహిపాల్ అన్నారు. కేశంపేట మండల కేంద్రంలో పూలే జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో జెఏసి నాయకులు రమేష్ గౌడ్, డిఎస్పీ మండల ఉపాధ్యక్షుడు ఆనంద్, మండల నాయకులు కృష్ణ, విష్ణు, పురుషోత్తం, నరేష్, తిరుపతి, శ్రీశైలం, మహేష్ పాల్గొన్నారు.

### బడుగు, బలహీన వర్గాల ఆశాజ్యోతి పూలే

### ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి

హయత్‌నగర్: సమాజంలోని అణగారిన వర్గాల అభ్యున్నతి కోసం కృషి చేసిన మహనీయుడు జ్యోతిరావు పూలే అని ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి అన్నారు. పూలే జయంతి సందర్భంగా ఎల్.బి నగర్ నియోజకవర్గం, మన్సూరాబాద్ డివిజన్ పరిధిలోని కామినేని చౌరస్తా వద్ద పూలే విగ్రహానికి ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో బిఆర్ఎస్ నాయకులు జక్కిడి రఘువీర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.







